క్లుప్తంగా

రుణాల మోసంపై కేసు

నాగులుప్పలపాడు: రుణాలు ఇప్పించడంతో పాటు వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వచ్చేలా చేస్తామని పలువురిని నమ్మించి అక్రమంగా డబ్బులు కాజేసినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన కోటి విజయ్‌కుమార్ ఆయన కుమార్తె కోటి స్మైలీ చాలా మంది వ్యక్తుల దగ్గర నుంచి పీఎంఈజీపీ లోన్‌లు ఇప్పిస్తామని నమ్మబలికి ఈదుమూడి గ్రామానికి చెందిన మహిళ వద్ద నుంచి రూ.10 లక్షలు కాజేశారు. దాంతో పాటుగా బాతుల వ్యాపారం పేరుతో జిల్లా వ్యాప్తంగా అనేక మంది నుంచి లక్షలాది డబ్బులు వసూలు చేసి అనంతరం వ్యాపారం లేదు. నష్టాలు వచ్చాయని అమాయకులను మోసం చేసిన కేసులో బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


ప్రమాదంలో గాయపడిన హరిబాబు

నాగులుప్పలపాడు: అతి వేగంగా వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం సాయంత్రం మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. చదలవాడ గ్రామానికి చెందిన బేల్దారి మేస్త్రీ హరిబాబు పని నిమిత్తం నాగులుప్పలపాడు వెళ్లి తిరుగు ప్రయాణంలో చదలవాడ వస్తున్నాడు. ఈక్రమంలో మండల కార్యాలయాల సముదాయం సమీపంలో 216 జాతీయ రహదారిపై అతి వేగంగా వచ్చిన కారు ఢీకొని మోటారు సైకిల్ పై వెళ్తున్న హరిబాబుకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలుకు తరలించారు.

తిరునాళ్లను డ్రోన్‌లతో పర్యవేక్షణ


అజయ్‌బాబు, ఎస్సై

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు ప్రసన్నాంజనేయ స్వామి 60వ వార్షికోత్సవ తిరునాళ్లలో సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షిస్తామని ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరునాళ్లకు వెళ్లే రహదారిలో వన్‌వే ఏర్పాటు చేశామన్నారు. తిరునాళ్లకు వెళ్లేందుకు ఎనికపాడు రహదారి మీదగా, తిరిగి వచ్చేందుకు గుమ్మలంపాడు డొంక నుంచి గ్రామంలోకి వచ్చేందుకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యుత్ ప్రభలకు సంబంధించి రాజకీయ పార్టీలు ఎటువంటి గొడవలు, వివాదాలు లేకుండా ప్రశాంతంగా తిరునాళ్ల జరిగేలా చూడాలని ఎస్సై కోరారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై, పోలీస్ బృందం బందోబస్తు చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీనివాసరావు

మద్దిపాడు: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కీర్తిపాడు, గాజులపాలెం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజు గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వే చేయాలన్నారు. గ్రామాల్లో సిబ్బంది చేపడుతున్న ఫాగింగ్, ఎబేట్ పిచికారీ పనులను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, కార్యదర్శి ఆశాలత, ఏఎన్ఎం మస్తాన్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: అనాథలకు దాతలు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రవాస భారతీయులు వంకాయలపాటి సాంబశివరావు కవిత దంపతులు ప్రీతం, వర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, ఫ్యాన్లు ఇతర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు కొమ్మి రమణయ్య, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తేళ్ల అరుణ, నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, మారెళ్ల సుబ్బారావు, రాజేశ్వరి, సత్యవతి, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. పచ్చనేతలకు భోజ్యం


సంతనూతలపాడులో గతేడాది నవంబర్‌లో పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు (ఫైల్)


రైస్ మిల్లులో పాలిష్ చేయడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం (ఫైల్)

- పేదల బియ్యం.. పొరుగున బేరం!
- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- అధికార అండతో రెచ్చిపోతున్న పచ్చ ముఠా
- అధికారులకు పట్టుబడినా మారని వైనం

సంతనూతలపాడు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు నేటి వరకు ఎక్కడపడితే అక్కడ ఏదిపడితే అది దోచేస్తున్నారు. ప్రకృతి విధ్వంసం మొదలు.. మనుషులపై దాడులు చేసేవరకు కూడా ఎక్కడా తగ్గడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు సరఫరా అవుతున్న చౌక బియ్యాన్ని కొందరు బొక్కేస్తున్నారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొని మిల్లులు, గోదాములకు తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గంటల తరబడి రేషన్ షాపుల వద్ద క్యూలలో నిల్చునే దుస్థితి నెలకొంది. దీంతో చాలా మంది దుకాణాలకు వెళ్లడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని డీలర్లు కూడా వ్యాపారులతో కుమ్మక్కై కేవలం 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేసి మమ అనిపిస్తున్నారు. స్టాక్ అయిపోయిందని చెప్పి, మిగిలిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. పాలిష్ చేసి.. సన్నబియ్యంగా కొంతమంది ప్రతి నెలా నియోజకవర్గంలోని ఊరూరా ఇంటింటికీ వెళ్లి కిలో రూ.15 నుంచి రూ.18తో కొనుగోలు చేస్తున్నారు. పేర్నమిట్టలో గల షాపుల్లో వీఆర్వో లాగిన్ సాకుతో బహిరంగంగానే డబ్బులు మాత్రమే ఇస్తాం అంటూ హుకుం జారిచేస్తూ పేదల బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లో వాటిని ఆటోల ద్వారా ఓ చోట నిల్వ చేస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి ఓ దళారీ రూ.24 ప్రకారం కొని తదితర ఇతర రాష్ట్రాల ప్రాంతాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. 15 రోజులకోసారి 30 నుంచి 40 లోడ్‌ల బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ కేజీ బియ్యం రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

'అధికార' ఆశీస్సులతోనే!

జాతీయ రహదారి అక్రమార్కులకు వరంగా మారింది. చీకటి పడగానే ఈ మార్గంలో బియ్యం తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. పోలీసులకు మామూళ్లు ఇస్తూ పట్టపగలే బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం. సంతనూతలపాడులో నలుగురు టీడీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నాలుగు మండలాల్లోనూ అధికార పార్టీ నాయకులేన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. వాటిని తిరిగి క్వింటా రూ.3,800 నుంచి రూ.4,200 గ్రామాల్లో విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

పెంచిన గ్యాస్ ధరలతో పెనుభారం


వంటగ్యాస్ ధరలపై నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళా నాయకులు


నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ పై వేసిన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పేర్నమిట్టలో పార్టీ నాయకులు నిరసన చేశారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతూ నిరంతరం ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. ప్రపంచ మార్కెట్లో ఆయిల్ ధరలు తగ్గుతున్నా ఉన్న కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించకుండా రోజురోజుకు పెంచుతోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రజల సంపదను దోచిపెడుతూ, రాయితీ ఇస్తూ ప్రజలపై భారాలు వేస్తుందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై ధరల భారాలు వేస్తున్నా రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేనలు నోరు తెరిచి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి అన్ను వెంకట సుబ్బారావు నాయకులు దాసరి చిన్నబాబు, ఉంగరాల రామకృష్ణ, ఆముదాల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించేంతవరకు ఉద్యమం

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సత్యనారాయణపురంలో ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 చొప్పున పెంచడం దారుణమన్నారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ ధరలతో పాటుగా పెట్రోలు, డీజిల్ ధరలను నిత్యం పెంచుతూ పోవడం ద్వారా ప్రజల నెత్తిన మోయలేని భారం వేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో మహిళా నాయకులు వై.అంజనీదేవి, కే రాజేశ్వరి, వై. మల్లేశ్వరి, పి.లక్ష్మి, భారతి, కుసుమ, జ్యోతి, ఈశ్వరమ్మ, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై చెన్నకేశవస్వామి


శేష వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

ఒంగోలు మెట్రో: ప్రసన్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నకేశవస్వామిస్వామి శేష వాహనంపై ఊరేగారు. నగరంలోని కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా దేవస్థానాన్ని విద్యుత్ దీప తోరణాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. సోమవారం స్వామివారికి అంకురారోహణ, ధ్వజారోహణతో మొదలైన కార్యక్రమాలు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. రాత్రికి నగర పురవీధుల్లో శేష వాహనం మీద నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రావెళ్ల శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవదాయ శాఖ ఈఓల నూతన కార్యవర్గం ఎన్నిక


ఈఓ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు మెట్రో: దేవదాయ శాఖ కార్య నిర్వాహణాధికారుల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఒంగోలులోని ఓ ప్రైవేట్ రెస్టారెంట్‌లో నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని 51 మంది ఎండోమెంట్ ఈఓలు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఆళ్ల సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ఉప్పలమర్తి శీను, జనరల్ సెక్రటరీగా పప్పు కార్తీక్, జాయింట్ సెక్రటరీగా ప్రసన్నలక్ష్మి, ట్రెజరర్‌గా కేవీ సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కట్టా సునీల్, కార్యనిర్వాహక సభ్యులుగా మద్దినేని శ్రీనివాస్, గుంటుపల్లి వాసు, చిక్కుళ్ల శ్రీను, వి.రవీంద్రనాథ్, పి.కొండారెడ్డి, రామ్‌గోపాల్, డి.అనిల్ తదితరులు ఎన్నికయ్యారు.

నేడు వైఎస్సార్ సీపీ ప్రభ రామతీర్థానికి తరలింపు

చీమకుర్తి రూరల్: గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా 12వ తేదీ రామతీర్థంలో జరిగే తిరునాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభ తడిక ఈరోజు ఉదయం 8 గంటలకు బూచేపల్లి కళ్యాణ మండపం దగ్గర నుంచి రామతీర్థం నిధిలోకి ఊరేగింపుతో తరలించే కార్యక్రమం ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగ నాగార్జున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బూచేపల్లి అభిమానులు పాల్గొనాలని కోరారు.

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

సంతనూతలపాడు: అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని 86, 89, 95, 96, 97 పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్ల కంటే అధికంగా ఉండటంతో అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు నిమిత్తం మంగళవారం సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మితో కూడిన బృందం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్లు కంటే అధికంగా ఉండటంతో వీటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు, వసతులపై బీఎల్వోలతో తహసీల్దార్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక అంగనవాడీ కేంద్రాలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. చిన్నారుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి చిన్నారులతో ఆమె మాట్లాడారు. అదనపు ఓట్లకు సంబంధించి ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై ఆమె చర్చించారు.

నేటి నుంచి పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

మద్దిపాడు: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మద్దిపాడు పరిధిలో బుధవారం 9వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక సచివాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామని సీడీపీవో ఇవాంజిలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా పోషణ్ పక్వాడా పక్షోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు.

ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా శ్రీనివాసరావు


ఎం శ్రీనివాసరావు

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడలో ఏపీబీఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో సమాఖ్య అధ్యక్షుడిగా కోనూరు సతీష్ శర్మ కార్యదర్శిగా హెచ్ కే మనోహరరావు, కోశాధికారిగా పులిపాక సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ నెలలో 15వ తేదీ మంగళవారం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఈ కమిటీలో రాష్ట్ర ప్రచార కమిటీలో కార్యదర్శిగా ప్రకాశం జిల్లా ఒంగోలు నగరానికి చెందిన ముక్తినూతలపాటి శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని కోమటికుంట, కొండేపల్లి, తిప్పాయపాలెం, గజ్జలకొండ, పెద్దయాచవరం, తర్లుపాడు మండలంలోని గానుగపెంట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలి


తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్‌లు

కొత్తపట్నం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పాస్టర్ ప్రవీణ్ మృతిపై పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ పగడాల ప్రవీణ్ మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది ముమ్మాటికి హత్యగానే స్పష్టమైందని తెలిపారు. క్రైస్తవులపై నిరంతర దాడులు జరుగుతున్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో క్రైస్తవులపై నిరంతర దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పాస్టర్లు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం దగ్గరకు వచ్చారు. కార్యక్రమంలో కె.సురేష్, బి.విజయేంద్రబాబు, శామ్యూయల్, శేఖర్ బాబు, శైలేష్, ప్రభుదాసు, హోసన్న, స్టీఫెన్సన్, రాజేంద్ర, జార్జ్, సుభాని, పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు గుమ్మలంపాడు తిరునాళ్లు


పూజలు అందుకుంటున్న ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మళంపాడులోని ప్రసన్నాంజనేయ స్వామి 60వ వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా గుమ్మనంపాడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానంద రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ రానున్నారు. పార్టీ నాయకులు బొక్కిసం శివరామయ్య, మొలకలపల్లి సుబ్బారావు, బొడ్డపాటి ఆంజనేయులు, బొడ్డపాటి శ్రీనివాసరావు, మంగపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ నాలుగు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు మొదలగు నాయకులు, వైఎస్సార్ కుటుంబ అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి మంగళవారం కోరారు. అదే విధంగా టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేయనున్నారు.

మెరిట్ కమ్ రోస్టర్‌లో పదోన్నతులు కల్పించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీటీఏ నాయకులు

ఒంగోలు సిటీ: మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సంబంధించిన కరపత్రాలను అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కల్లగుంట మోహన్‌రావు మాట్లాడుతూ.. పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ, మహిళ ఉపాధ్యాయులకు సామాజిక న్యాయం చేస్తున్న మెరిట్ కం రోస్టర్ విధానానికి ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. కేవలం మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని, దశల వారీగా ఆందోళన చేపడుతామన్నారు. స్పాట్ కేంద్రాల వద్ద నిరసన, 10, 11,12 తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతి, 17వ తేదీ జిల్లా కలెక్టరేట్ దగ్గర ధర్నా, ఏప్రిల్ 25వ తేదీ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని దశల్లో పోరాటాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొరాబత్తిన జాలరామయ్య, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు, జిల్లా నాయకులు జగన్నాథం ప్రసాదరావు, పల్లె కష్ణమూర్తి షేక్ అబ్దుల్లా, మిరియాల వెలుగొండయ్య, గాలిమోటు భాస్కరరావు, దేవరకొండ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సత్కారం


నాగేశ్వరమ్మను సన్మానిస్తున్న సంగీత కళాకారులు

ఒంగోలుమెట్రో: రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉగాది పురస్కారం అందుకున్న గాయని చల్లా నాగేశ్వరమ్మను సత్కరించారు. మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి కళా సంస్థ పేరుతో నాగేశ్వరమ్మ చేసిన కృషి మరువలేనిదన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో కచేరీలు నిర్వహించి ఆధ్యాత్మిక, సంప్రదాయ, జానపద పాటలను ఆమె సమాజంలోకి విరివిగా అందించారన్నారు. ముఖ్యంగా అనేకమంది యువ గాయక, గాయనీమణులను తీర్చిదిద్దడంతో పాటు పలువురు కళాకారులకు సన్మానం చేయడం నాగేశ్వరమ్మ ప్రత్యేకతగా వారు పేర్కొన్నారు. ఆమెకు పురస్కారం రావడం జిల్లాకి గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎన్ సుకుమార్, అధ్యక్షులు ఎస్ .కె.బాబు, కార్యదర్శి, ఎ.మనోహర్, కోశాధికారి యు కోటేశ్వరరావు నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు నాగమణి శ్రీనివాస్, లక్ష్మీ తులసి, శ్రీదేవి, నాగరాజు, వెంకటలక్ష్మి, నాగేంద్రమ్మ, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ధ్వంసం


ధ్వంసమైన ఏటీఎం

ఒంగోలు టౌన్: నగరంలోని నడిబొడ్డున ఒక ఏటీఎంను దుండగులు ధ్వంసం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న దిబ్బల రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను సోమవారం అర్ధరాత్రి కొందరు దుండగులు పగులగొట్టారు. మంగళవారం తెలవారుజామున దుకాణాలు తెరచిన వ్యాపారులు ఈ విషయాన్ని గమనించి తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విచారణ ప్రారంభించారు. దుండగులను గుర్తించేందుకు పోలీసు డాగ్స్‌ను రప్పించారు.